
జాతీయ దిన పత్రిక

# తొలివెలుగు

మన భాష.. మన పత్రిక..




నిజామాబాద్ | సంపుటి : 01 | సంచిక : 11 | పేజీలు : 4 | సోమవారం | 19 జనవరి 2026 | వెల : 2/-

## ముఖ్యమంత్రివా..? ముఠా నాయకుడివా..?

### - సీఎం రేవంత్ రెడ్డిపై కేటీఆర్ ఫైర్



- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై కేటీఆర్ తీవ్రస్థాయిలో ధ్వజం
- బీఆర్ఎస్ జెండా గద్దెలు కూల్చాలన్నారంటూ తీవ్ర ఆగ్రహం
- శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా సీఎం వ్యాఖ్యలున్నాయని ఆరోపణ
- సీఎం రేవంత్‌పై చర్యలు తీసుకోవాలని డీజీపీని డిమాండ్ చేసిన కేటీఆర్
- పాత బాస్ ఆదేశాలతోనే రేవంత్ పనిచేస్తున్నారని విమర్శ

వివరాలు 2 లో..

# మీరు, మీరు చూసుకోండి.. మా మంత్రుల జోలికి రావొద్దు

## - మీడియాకు రేవంత్ రెడ్డి స్ట్రాంగ్ వార్నింగ్



- మీడియా సంస్థల మధ్య గొడవలుంటే తలుపులు మూసుకొని కొట్టుకోవాలన్న సీఎం రేవంత్
- మంత్రులను బద్నాం చేయవద్దు, రాసేముందు తన వివరణ తీసుకోవాలని సూచన
- సింగరేణి టెండర్లలో అవినీతికి తావులేదు, అనుభవం ఉన్నవారికే కాంట్రాక్టులు అని స్పష్టం
- ఖమ్మంలో 362 కోట్ల అభివృద్ధి పనులకుశంకుస్థాపన

డెస్క్, జనవరి 18 (తొలివెలుగు) : తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మీడియా సంస్థలపై తీవ్ర స్వరంతో విరుచుకుపడ్డారు. తమ మంత్రుల ప్రతిష్ఠకు భంగం కలిగించేలా వార్తలు రాయవద్దని, మీడియా సంస్థల మధ్య ఏవైనా గొడవలుంటే తలుపులు మూసుకుని కొట్టుకోండి అని ఘాటుగా వ్యాఖ్యానించారు. సింగరేణి బొగ్గు గనుల కేటాయింపులో కుంభకోణం జరిగిందంటూ మీడియాలో వచ్చిన కథనాలను ఆయన తీవ్రంగా ఖండించారు. ఆదివారం ఖమ్మం జిల్లాలో పర్యటించిన ఆయన, పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన అనంతరం ఏదులాపురంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ప్రసంగించారు. ఈ సందర్భంగా మీడియాను ....

2

## మేడారం జాతర స్పెషల్ బస్సుల్లోనూ మహిళలకు ఉచిత ప్రయాణం

- బస్సు చార్జీలను ఖరారు చేసిన ఆర్టీసీ
- హైదరాబాద్ నుంచి రూ.600 - రూ.1,110
- వరంగల్, హనుమకొండ నుంచి రూ.250 నుంచి రూ.500



డెస్క్, జనవరి 18 (తొలివెలుగు) : మేడారం జాతరకు వెళ్లే మహిళలకు ఆర్టీసీ శుభవార్త చెప్పింది. జాతర సందర్భంగా ఆర్టీసీ స్పెషల్ సర్వీసులు నడపనున్న విషయం తెలిసిందే. ఈ ప్రత్యేక బస్సుల్లోనూ మహిళలకు ఉచిత ప్రయాణ సదుపాయం కల్పిస్తున్నట్లు ప్రకటించింది. ఈ మేరకు శనివారం జాతర స్పెషల్ బస్సులకు టికెట్ ధరలను ఖరారు చేస్తూ ఆర్టీసీ ఓ ప్రకటన విడుదల చేసింది. వరంగల్, హనుమకొండ, హైదరాబాద్ సహా రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి మేడారానికి ప్రత్యేక బస్సులను నడపనున్నట్లు తెలిపింది.

మిగతా 2 లో..

## ఆస్తుల సంపాదన కోసం రాజకీయాల్లోకి రాలేదు

### - భట్టి విక్రమార్క

నైనీ బొగ్గు బ్లాక్ టెండర్ల విషయంలో ఓ పత్రికలో అడ్డగోలు రాతలంటూ ఫైర్

కట్టుకథలకు భయపడి లొంగిపోయే వ్యక్తిని కాదన్న డిప్యూటీ సీఎం


ప్రభుత్వ వనరులు ప్రజలకు సమానంగా పంచడమే తన లక్ష్యమని వెల్లడి

మిగతా 2 లో..

## తెలంగాణలో భారీ ఎత్తున నకిలీ నోట్లు స్వాధీనం

### - ముగ్గురు అరెస్టు

- ముగ్గురు నకిలీ నోట్ల ముఠా సభ్యులను అదుపులోకి తీసుకున్నామన్న గుడిమల్కాపూర్ పీఎస్ ఇన్స్పెక్టర్ రాజు
- రూ.42 లక్షల విలువైన రూ.500 నకిలీ నోట్లు స్వాధీనం చేసుకున్న పోలీసులు
- పూర్తి వివరాలు దర్యాప్తు పూర్తయ్యాక వెల్లడిస్తామన్న సీఐ




డెస్క్, జనవరి 18 : (తొలివెలుగు) నకిలీ కరెన్సీ నోట్లను సరఫరా చేస్తున్న ముగ్గురు సభ్యుల ముఠాను పోలీసులు అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రూ.42 లక్షల విలువైన రూ.500 నోట్ల నకిలీ కట్టలను స్వాధీనం చేసుకున్నారు. గుడిమల్కాపూర్ ఇన్స్పెక్టర్ బైరి రాజు తెలిపిన వివరాలతో ఈ సంఘటన వెలుగులోకి వచ్చింది. గుడిమల్కాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని రేతిబోలి సమీపంలో ఉన్న ఒక అపార్ట్మెంట్ వద్ద నకిలీ కరెన్సీ నోట్ల సరఫరా జరుగుతోందని పోలీసులకు సమాచారం అందింది. వెంటనే అప్రమత్తమైన పోలీసులు అక్కడికి చేరుకుని దాడి నిర్వహించారు. దాడిలో నకిలీ కరెన్సీని సరఫరా చేస్తున్న ముఠాను అదుపులోకి తీసుకుని, వారి వద్ద నుంచి రూ.42 లక్షల విలువైన రూ.500 నోట్ల నకిలీ కరెన్సీని స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనలో ముగ్గురిని అరెస్టు చేసి కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. ఈ నకిలీ కరెన్సీ సరఫరా వెనుక పెద్ద ముఠా ఉండే అవకాశం ఉందని, మరింత మంది ఈ నేరంలో భాగస్వాములై ఉండవచ్చని ఇన్స్పెక్టర్ బైరి రాజు తెలిపారు. ఈ కేసులో పూర్తి వివరాలను దర్యాప్తు పూర్తయ్యాక వెల్లడిస్తామని ఆయన పేర్కొన్నారు.

## తెలంగాణలో ప్రైవేట్ స్కూల్ ఫీజులకు కళ్లెం

### -త్వరలో కొత్త చట్టం

- ప్రైవేట్ స్కూల్ ఫీజుల నియంత్రణకు తెలంగాణ ప్రభుత్వం కసరత్తు
- రెండేళ్లకు ఒకసారి 8 శాతం ఫీజు పెంపునకు ప్రతిపాదన
- ప్రభుత్వ నిర్ణయంపై ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాల అభ్యంతరం
- త్వరలో కేబినెట్ ముందుకు ఫీజుల నియంత్రణ బిల్లు



డెస్క్, జనవరి 18 (తొలివెలుగు) : తెలంగాణలోని ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజుల నియంత్రణ దిశగా రాష్ట్ర ప్రభుత్వం కీలక అడుగులు వేస్తోంది. సామాన్య తల్లిదండ్రులపై భారం తగ్గించే లక్ష్యంతో రెండేళ్లకు ఒకసారి కేవలం 8 శాతం మాత్రమే ట్యూషన్ ఫీజు పెంచుకునేలా విధివిధానాలు ఖరారు చేసింది. ఈ మేరకు ప్రత్యేక చట్టాన్ని తీసుకురావడానికి కసరత్తు చేస్తోంది. ఈ అంశంపై ఏర్పాటైన మంత్రివర్గ ఉపసంఘం సిఫార్సుల మేరకు విద్యా కమిషన్ "తెలంగాణ ప్రైవేట్ అన్ఎయిడెడ్ స్కూల్ రెగ్యులేటరీ అండ్ మానిటరింగ్ కమిషన్ ముసాయిదా బిల్లు-2025"ను సిద్ధం చేసింది. పురపాలక ఎన్నికల తర్వాత జరిగే కేబినెట్ సమావేశంలో ఈ బిల్లును ఆమోదించి చట్టబద్ధత కల్పించాలని ప్రభుత్వం భావిస్తోంది. నిబంధనల ప్రకారం, 8 శాతం కంటే ఎక్కువ ఫీజు పెంచాలనుకుంటే, ప్రభుత్వం ఏర్పాటు చేసే రాష్ట్రస్థాయి కమిషన్ నుంచి తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలి. అయితే, ప్రభుత్వ ప్రతిపాదనను ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. ఏటా ద్రవ్యోల్బణం 5-6 శాతం పెరుగుతోందని, టీచర్ల జీతాలు, భవనాల అద్దెలు ఏటా పెరుగుతున్నాయని, ఇలాంటి పరిస్థితుల్లో రెండేళ్లకు ఒకసారి 8 శాతం పెంపు ఏమాత్రం గిట్టుబాటు కాదని స్పష్టం చేస్తున్నాయి. ఉన్నత విద్యా సంస్థల మాదిరిగా పాఠశాలల్లో యాజమాన్య కోటా వంటి అదనపు ఆదాయ మార్గాలు ఉండవని వారు గుర్తు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఇతర రాష్ట్రాల్లో ఉన్నట్లుగా ఏటా ఫీజులు పెంచుకునే అవకాశం కల్పించాలని యాజమాన్యాలు డిమాండ్ చేస్తున్నాయి. ఈ విషయంపై చర్చించేందుకు త్వరలోనే మంత్రివర్గ ఉపసంఘంతో ప్రైవేట్ పాఠశాలల ప్రతినిధులు భేటీ కానున్నారు. అటు తల్లిదండ్రులకు ఉపశమనం, ఇటు విద్యాసంస్థల మనుగడ మధ్య ప్రభుత్వం ఎలాంటి మధ్యేమార్గం కనుగొంటుందనేది ఆసక్తికరంగా మారింది.

## హార్వర్డ్ విద్యార్థిగా సీఎం రేవంత్ రెడ్డి

### - ప్రత్యేక కోర్సులో చేరిక

- 5 రోజుల పాటు కొనసాగనున్న 'లీడర్‌షిప్ ఫర్ ట్వంటీ ఫస్ట్ సెంచరీ' కోర్సు
- భారతదేశంలో ఇలాంటి కోర్సులో చేరుతున్న తొలి సిట్టింగ్ సీఎంగా గుర్తింపు



డెస్క్, జనవరి 18 (తొలివెలుగు) : తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అమెరికాలోని ప్రతిష్ఠాత్మక హార్వర్డ్ యూనివర్సిటీలో విద్యార్థిగా చేరనున్నారు. ఆయన 5 రోజుల పాటు జరిగే ఎగ్జిక్యూటివ్ లీడర్‌షిప్ ప్రోగ్రామ్‌లో పాల్గొనేందుకు తన పేరును నమోదు చేసుకున్నారు. స్వతంత్ర భారతదేశ చరిత్రలో పదవిలో ఉండగా ఒక ముఖ్యమంత్రి ఇలాంటి ఐవీ లీగ్ యూనివర్సిటీలో నాయకత్వ కోర్సు చేయడం ఇదే తొలిసారి కావడం విశేషం. హార్వర్డ్ కెనెడీ స్కూల్ ఆఫ్ గవర్నమెంట్‌లో ఈ నెల 25 నుంచి 30 వరకు ఈ కోర్సు జరగనుంది. 'లీడర్‌షిప్ ఫర్ ది ట్వంటీ ఫస్ట్ సెంచరీ: కేయాస్, కాన్ఫ్లిక్ట్, అండ్ కరేజ్' (21వ శతాబ్దపు నాయకత్వం: అరాజకం, సంఘర్షణ, ధైర్యం) పేరుతో ఈ ప్రోగ్రామ్‌ను నిర్వహిస్తున్నారు. ఈ కోర్సులో భాగంగా తరగతులకు హాజరవడం, అసైన్‌మెంట్లు పూర్తి చేయడం, హోంవర్క్ సమర్పించడం, గ్రూప్ ప్రాజెక్టులలో పాల్గొనడం వంటివి ఉంటాయి. వాస్తవ ప్రపంచంలోని సమస్యలను కేస్ స్టడీస్‌గా తీసుకుని, వాటికి పరిష్కారాలు కనుగొనడంపై ఈ కోర్సులో ప్రధానంగా దృష్టి సారిస్తారు. ఐదు ఖండాలకు చెందిన 20కి పైగా దేశాల నుంచి సీనియర్ నాయకులు, నిపుణులు ఈ శిక్షణా కార్యక్రమంలో పాల్గొంటారు. కోర్సు విజయవంతంగా పూర్తి చేసిన తర్వాత రేవంత్ రెడ్డికి హార్వర్డ్ యూనివర్సిటీ నుంచి సర్టిఫికేషన్ లభిస్తుంది. పదవిలో ఉండగా హార్వర్డ్ సర్టిఫికెట్ అందుకోనున్న తొలి భారత ముఖ్యమంత్రిగా కూడా ఆయన నిలవనున్నారు. ఆధునిక నాయకత్వ విధానాలను అధ్యయనం చేసి, వాటిని తెలంగాణ పాలనలో అమలు చేయాలనే ఉద్దేశంతో రేవంత్ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటున్నారని తెలుస్తోంది.

Toli Velugu 19.01.26 by 2_Layout 1 1/19/2026 7:43 AM Page 2



# మీరు, మీరు చూసుకోండి.. మా మంత్రుల జోలికి రావొద్దు

## - మీడియాకు రేవంత్ రెడ్డి స్ట్రాంగ్ వార్నింగ్

మొదటిపేజీ తరువాయి..
ఉద్దేశించి సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ, "మీకు గొడవలుంటే మీరు, మీరు చూసుకోండి. మా మంత్రుల జోలికి మాత్రం రావొద్దు. ఏదైనా రాసేముందు నన్ను వివరణ అడగండి, నేను ఎప్పుడైనా అందుబాటులో ఉంటాను. అంతేకానీ మా మంత్రులను బద్నాం చేయొద్దు. వారిపై వార్తలు వస్తే నా గౌరవానికి భంగం కలుగుతుంది" అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. రెండు మీడియా సంస్థల మధ్య వివాదం నడుస్తోందన్న ప్రచారం నేపథ్యంలో సీఎం ఈ వ్యాఖ్యలు చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది. బీఆరఎస్ నేతలు బలపడేలా తప్పుడు ప్రచారాలు చేయవద్దని ఆ రెండు మీడియా సంస్థలకు హితవు పలికారు. అనంతరం సింగరేణి అంశంపై మాట్లాడుతూ, కొన్ని పత్రికలు బొగ్గు మా-యమైందని, కుంభకోణం జరిగిందని అసత్యాలు రాస్తున్నాయని విమర్శించారు. "సింగరేణి టెండర్లను అనుభవం ఉన్న సంస్థలకే ఇస్తాం. ఇందులో ఏ మాత్రం అవినీతికి తావు లేదు. మా రెండేళ్ల పాలనలో ఎలాంటి అవకతవకలు జరగలేదు" అని ఆయన స్పష్టం చేశారు. ఖమ్మం జిల్లా నుంచే తన రాజకీయ ప్రస్థానం ప్రారంభమైందని గుర్తు చేసుకున్న రేవంత్, జిల్లా అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని తెలిపారు. ఈ పర్యటనలో భాగంగా రూ.362 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. గత బీఆరఎస్ ప్రభుత్వంపై విమర్శలు గుప్పిస్తూ, ఆ ప్రభుత్వ హయాంలో రేషన్ కార్డు పొందాలంటే ఎవరో ఒకరు చనిపోవాల్సిన దుస్థితి ఉండేదని, కానీ తమ కాంగ్రెస్ ప్రభుత్వం లక్షలాది మందికి కొత్త రేషన్ కార్డులు ఇచ్చిందని తెలిపారు. ఎన్టీఆర్ రూ.2కే కిలో బియ్యం ఇస్తే, తాము ఉచితంగా సన్నబియ్యం అందిస్తున్నామని, వైఎస్ఆర్ ఉచిత విద్యుత్ స్ఫూర్తితో 200 యూనిట్ల వరకు ఉచిత కరెంటు ఇస్తున్నామని వివరించారు. అధికారంలోకి వచ్చిన వెంటనే 4.50 లక్షల ఇందిరమ్మ ఇళ్లను పేదలకు కేటాయించామని చెప్పారు. భద్రాచలం అభివృద్ధిపై మాట్లాడుతూ, కేసీఆర్ రూ.100 కోట్లు ఇస్తానని మాట తప్పారని, తమ ప్రభుత్వం భూసేకరణ పూర్తి చేసి అయోధ్య తరహాలో భద్రాద్రిని అద్భుతంగా తీర్చిదిద్దుతుందని హామీ ఇచ్చారు. మంత్రులంతా సమన్వయంతో పనిచేస్తున్నారని, రాబోయే పదేళ్లు కాంగ్రెస్ ప్రభుత్వమే అధికారంలో ఉంటుందని, తెలంగాణను దేశంలోనే నంబర్ వన్ రాష్ట్రంగా తీర్చిదిద్దుతామని సీఎం రేవంత్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు.

# ఆస్తుల సంపాదన కోసం రాజకీయాల్లోకి రాలేదు

## - భట్టి విక్రమార్క



మొదటిపేజీ తరువాయి..
డెస్క్, జనవరి 18 (తొలివెలుగు) : కట్టుకథలు, పిట్ట కథలు అల్లి ప్రజలను మభ్య పెట్టేలా కథనాలు ప్రచురిస్తే భయపడి లొంగిపోయే వ్యక్తిని కాదంటూ తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఓ పత్రికపై మండిపడ్డారు. నైనీ బొగ్గు గనుల టెండర్ల వ్యవహారంలో తనపై ఆరోపణలు గుప్పిస్తూ ఓ పత్రికలో వచ్చిన కథనంపై భట్టి స్పందించారు. ప్రజాభవన్ లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆస్తుల సంపాదన కోసమో, వ్యాపారాన్ని విస్తరించుకునేందుకో రాజకీయాల్లోకి రాలేదని స్పష్టం చేశారు. ప్రభుత్వ ఆస్తులను, వనరులను ప్రజలకు సమానంగా పంచడమే తన లక్ష్యమని ఆయన చెప్పారు.

"నైనీ బొగ్గు బ్లాక్ వ్యవహారంలో కేంద్ర ప్రభుత్వ నిబంధనల ప్రకారమే టెండర్లు పిలవాలని సింగరేణి సంస్థకు సూచించాం. టెండర్లను పిలిచింది సింగరేణి సంస్థే తప్ప మంత్రి కాదు. గనులు ఉన్న ప్రాంతం క్లిష్టమైనది కావడంతో ఫీల్డ్ విజిట్ నిబంధన తప్పనిసరి. కేంద్ర ప్రభుత్వ సంస్థల్లోనూ ఇలాంటి నిబంధనలు ఉన్నాయి. సింగరేణి ప్రజల ఆస్తి.. బొగ్గు గనులు ప్రజల ఆత్మగౌరవం. గద్దలు, దోపిడీదారులు, వ్యవస్థీకృత నేరగాళ్ల నుంచి తెలంగాణ ఆస్తులను కాపాడతాను. మీడియా సంస్థల మధ్య ఉన్న విషయాల్లోకి ప్రజాప్రతినిధులను లాగొద్దు.

వ్యక్తిత్వాన్ని హననం చేసే కథనాలు రాసే అధికారం ఎవరికీ లేదు. ఆ మీడియా కథనంలో నా పేరును అనవసరంగా తీసుకువచ్చారు. ఆ పత్రికలో వచ్చిన కథనం వెనుక రాజకీయ ఉద్దేశం ఏమిటో తెలిశాక పూర్తి వివరాలు వెల్లడిస్తా. వైఎస్ రాజశేఖర్ రెడ్డిపై ఉన్న కోపాన్ని ఆయన సన్నిహితుడినైన నాపై చూపిస్తున్నారు. నాయకుల మధ్య విభేదాలు సృష్టించేందుకు కట్టుకథలు రాశారు. ఈ కట్టుకథలకు భయపడి లొంగిపోయే వ్యక్తిని కాదు" అని భట్టి విక్రమార్క అన్నారు.

# ముఖ్యమంత్రివా..? ముఠా నాయకుడివా..?

## - సీఎం రేవంత్ రెడ్డిపై కేటీఆర్ ఫైర్

మొదటిపేజీ తరువాయి..
డెస్క్, జనవరి 18 (తొలివెలుగు) : తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విరుచుకుపడ్డారు. బీఆర్ఎస్ జెండా గద్దెలను ధ్వంసం చేయాలంటూ సీఎం మాట్లాడడం ఏంటంటూ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. శాంతిభద్రతలను కాపాడాల్సిన ముఖ్యమంత్రి, హోంమంత్రి పదవుల్లో ఉండి ఇలాంటి వ్యాఖ్యలు చేయడం సిగ్గుచేటని మండిపడ్డారు. "ముఖ్యమంత్రివా లేక ముఠా నాయకుడివా?" అని కేటీఆర్ సూటిగా ప్రశ్నించారు. రాజ్యాంగబద్ధమైన బాధ్యతలను మరిచి, అసాంఘిక చర్యలను ప్రోత్సహించేలా మాట్లాడటం ద్వారా సీఎం తన స్థాయిని దిగజార్చుకున్నారని విమర్శించారు. తెలంగాణ ప్రజల గుండెల్లో గులాబీ జెండాకు ఉన్న స్థానాన్ని చూసి ముఖ్యమంత్రికి మైండ్ బ్లాక్ అయినట్లుందని కేటీఆర్ ఎద్దేవా చేశారు. రెండేళ్లలోనే కాంగ్రెస్ ప్రభుత్వం అట్టర్ ఫ్లాప్ అయిందని, తీవ్ర ప్రజా వ్యతిరేకతను మూటగట్టుకుందని ఆరోపించారు. ఈ నేపథ్యంలోనే సీఎంకు మతిభ్రమించిందని, ఆయన వ్యాఖ్యలే ఇందుకు నిదర్శనమని అన్నారు. సోషల్ మీడియాలో చిన్న పోస్టు పెడితేనే కేసులు పెట్టి అరెస్టులు చేసే పోలీసు శాఖ, ఇప్పుడు నేరుగా హింసను ప్రేరేపించేలా మాట్లాడిన ముఖ్యమంత్రిపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. ఈ వ్యాఖ్యలపై రాష్ట్ర డీజీపీ తక్షణమే స్పందించి, సీఎంపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ పక్షాన డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ముఖ్యమంత్రిగా ఉంటూ రేవంత్ రెడ్డి తెలుగుదేశం పార్టీ పాట పాడటం వెనుక పెద్ద కుట్ర దాగి ఉందని కేటీఆర్ ఆరోపించారు. గత రెండేళ్లుగా తన పాత బాస్ ఆదేశాల మేరకే తెలంగాణ జలహక్కులను కాలరాశారని, నేటి వ్యాఖ్యలతో ఆయన నిజస్వరూపం బట్టబయలైందని అన్నారు. కాంగ్రెస్ మునిగిపోయే నావ అని అర్థం కావడంతోనే, దాని నుంచి బయటకు దూకేందుకు రేవంత్ రంగం సిద్ధం చేసుకుంటున్నారని విమర్శించారు. ఒకవైపు బీజేపీతో చీకటి ఒప్పందాలు, మరోవైపు టీడీపీని రాష్ట్రంపై రుద్దే ప్రయత్నాలను తెలంగాణ సమాజం తిప్పికొడుతుందని హెచ్చరించారు. నీళ్లు, నిధులు, నియామకాల విషయంలో తెలంగాణకు ద్రోహం చేసినందుకు సీఎం రేవంత్ రెడ్డి భారీ మూల్యం చెల్లించుకోక తప్పదని కేటీఆర్ స్పష్టం చేశారు.

# మేడారం జాతర స్పెషల్ బస్సుల్లోనూ మహిళలకు ఉచిత ప్రయాణం

మొదటిపేజీ తరువాయి.. వరంగల్, హనుమకొండ నుంచి భక్తులు ఎక్కువ సంఖ్యలో మేడారం జాతరకు వస్తారని అంచనా వేసిన అధికారులు.. అక్కడి నుంచి పెద్ద సంఖ్యలో బస్సులు నడపాలని నిర్ణయించారు. వరంగల్, హనుమకొండ నుంచి మేడారానికి టికెట్ ధర బస్సుల ఆధారంగా రూ.250 నుంచి రూ.500, హైదరాబాద్ నుంచి రూ.600 నుంచి రూ. 1,110 వరకు నిర్ణయించినట్లు తెలిపారు. ఈ ప్రత్యేక బస్సుల్లోనూ మహిళలు, బాలికలు, ట్రాన్స్ జెండర్లకు 'మహాలక్ష్మి' పథకం వర్తిస్తుందని పేర్కొన్నారు.

# మునుగోడులో 'ఒంటి గంట' నిబంధన పక్కా!

- మద్యం వ్యాపారుల వినతి తిరస్కరణ..
- చండూరులో రూ. 30 కోట్ల పనులకు ఎమ్మెల్యే ప్రారంభోత్సవం
- మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి

మునుగోడు/చండూరు, జనవరి 18 (తొలివెలుగు) : మునుగోడు నియోజకవర్గంలో మద్యం షాపుల సమయపాలన విషయంలో ఎలాంటి మార్పు ఉండబోదని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి స్పష్టం చేశారు. మునుగోడులోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో తనను కలిసిన మద్యం వ్యాపారులతో జరిగిన సమావేశంలో ఈ విషయం తేల్చిచెప్పారు. మీ వ్యాపారాల కోసం ప్రజల ఆరోగ్యాలను పాడు చేయొద్దని హెచ్చరించిన ఆయన, ఉదయం నుంచే మద్యం సేవించే అలవాటుకు స్వస్తి పలికేలా వ్యాపారులు తమ ఆలోచన విధానాన్ని మార్చుకోవాలని సూచించారు. మద్యం నియంత్రణపై తాను తీసుకున్న నిర్ణయాల్లో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ ఉండదని స్పష్టం చేశారు. మధ్యాహ్నం ఒంటి గంట తర్వాతే వైన్ షాపులు తెరవాలని, సాయంత్రం ఆరు గంటల తర్వాతే పర్మిట్ రూములకు అనుమతి ఉంటుందని తెలిపారు. అవసరమైతే నియోజకవర్గంలో డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులను మరింత పెంచుతామని చెప్పారు. ఉదయం పని చేసి సాయంత్రం మాత్రమే మద్యం సేవించే విధానాన్ని ప్రజల్లో తీసుకురావడమే లక్ష్యమన్నారు. మద్యం విచ్చలవిడిగా లభ్యం కావడం వల్ల పనులు మానేసి నిరంతరం తాగుతూ ప్రాణాలు కోల్పోతున్న వారి సంఖ్య పెరుగుతోందని, యువత మద్యానికి బానిసై దారి తప్పుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. యువత ఆలోచనలు మద్యం నుంచి వ్యక్తిగత అభివృద్ధి వైపు మళ్లించడానికే ఈ చర్యలన్నారు. ఈ నిర్ణయానికి ఇతర నియోజకవర్గాల నుంచి కూడా మంచి స్పందన వస్తోందని తెలిపారు.





### చండూరు మున్సిపాలిటీలో రూ.30 కోట్ల అభివృద్ధి పనుల ప్రారంభం

చండూరు మున్సిపాలిటీలో రూ.30 కోట్ల వ్యయంతో నిర్మించిన మెయిన్ రోడ్డు (సీసీ రోడ్డు, డ్రైనేజీ పనులు)తో పాటు సెంట్రల్ లైటింగ్ వ్యవస్థను ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. నాటి ప్రభుత్వం పదవిలో ఉండి పోరాడితే అభివృద్ధికి నిధులు ఇవ్వలేదని, ఒక్క రాజీనామాతోనే ప్రభుత్వం మునుగోడు ప్రజల కాళ్ల దగ్గరకు వచ్చిందన్నారు. తన రాజీనామా ఫలితంగానే చండూరులో అభివృద్ధి పనులు ప్రారంభమయ్యాయని వ్యాఖ్యానించారు. 2018లో తొలిసారి అసెంబ్లీకి వెళ్లినప్పటి నుంచి మునుగోడు ప్రజల అభివృద్ధి కోసమే పనిచేస్తున్నానని చెప్పారు. మునుగోడు ప్రజలతో తనకు విడదీయరాని అనుబంధం ఉందని, ఈ రోడ్డు చండూరు చరిత్రలో నిలిచిపోయే విధంగా ఉంటుందన్నారు. చండూరులో 100 పడకల ఆసుపత్రి నిర్మాణం చేపడతామని, ఇంకా మూడు సంవత్సరాల కాలం ఉందని, చేయాల్సిన అభివృద్ధి చాలా ఉందన్నారు. హైదరాబాద్ తరహాలో మున్సిపాలిటీని అభివృద్ధి చేస్తానని తెలిపారు. కాంట్రాక్టర్ల బిల్లుల చెల్లింపుల కోసం ముఖ్యమంత్రితో మాట్లాడి మునుగోడుకు నిధులు తీసుకురావాలని కోరినట్లు వెల్లడించారు. తనకు పదవి మీద వ్యామోహం లేదని, ఈ ప్రాంత అభివృద్ధి కోసమే అహర్నిశలు శ్రమిస్తానని స్పష్టం చేశారు. మిగిలిన మూడు సంవత్సరాల్లో ప్రాంతాన్ని మరింత అభివృద్ధి చేసుకుందామని ప్రజలకు పిలుపునిచ్చారు.


Toli Velugu 19.01.26 by 2_Layout 1 1/19/2026 7:43 AM Page 3



# గుండంలో జారిపడి వివాహిత మృతి

- దేవుడి దర్శనానికి వెళ్లి అనంత లోకాలకు
- కూతురి పుట్టిన రోజునే తల్లి మృతి
- గ్రామంలో విషాద ఛాయలు





వలిగొండ, జనవరి 18 (తొలివెలుగు) : వలిగొండ, జనవరి 18 (తొలివెలుగు): దేవుడి దర్శనం కోసం వెళ్లిన ఓ వివాహిత ప్రమాదవశాత్తు మృతి చెందిన విషాద ఘటన వలిగొండ మండల పరిధిలోని పులిగిల్ల గ్రామంలో చోటుచేసుకుంది. కూతురు పుట్టిన రోజు సందర్భంగా ఆలయానికి వెళ్లిన ఆమె, గుండంలో జారిపడి ప్రాణాలు కోల్పోవడంతో గ్రామంలో విషాదం అలుముకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం యాదగిరిగుట్ట మండలం, మల్లాపురం గ్రామానికి చెందిన కర్రె లాస్య (27), సంక్రాంతి పండుగ సందర్భంగా తన తల్లి స్వగ్రామమైన పులిగిల్లకు వచ్చింది. ఆదివారం తన కుమార్తె పుట్టిన రోజు సందర్భంగా గ్రామంలోని రామలింగేశ్వర స్వామిని దర్శించుకునేందుకు వెళ్లింది. ఈ సందర్భంగా ఆలయం సమీపంలోని గుట్టపై ఉన్న గుండంలో కాళ్లు కడుక్కుంటుండగా ప్రమాదవశాత్తు జారి పడింది. ఈ ఘటనను గమనించిన స్థానికులు వెంటనే ఆమెను బయటకు తీసి ఆసుపత్రికి తరలించేందుకు ప్రయత్నించగా, మార్గమధ్యంలోనే ఆమె మృతి చెందినట్లు తెలిపారు. ఈ ఘటనతో గ్రామంలో తీవ్ర విషాదం నెలకొంది. మృతురాలు లాస్యకు ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు.

అంతేకాకుండా, ఆమె చనిపోయే ముందు రాముని గుట్టపైకి ఎక్కుతున్న సమయంలో తన తండ్రితో కలిసి తీసుకున్న వీడియోను ఇన్‌స్టాగ్రామ్ లో పోస్ట్ చేయడం ఇప్పుడు అందరినీ కన్నీళ్లు పెట్టిస్తోంది. ఆ వీడియో చూసిన పలువురు తీవ్రంగా భావోద్వేగానికి లోనవుతున్నారు. ఈ దుర్ఘటన గ్రామ ప్రజలను శోకసంద్రంలో ముంచెత్తింది.

# ఘనంగా ప్రారంభమైన రైల్వే ఉద్యోగుల క్రీడా పోటీలు

- గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహణ
- క్రికెట్ పోటీలకు శ్రీకారం చుట్టిన రామ్ భద్ర రావు



వలిగొండ, జనవరి 18 (తొలివెలుగు) : రాబోయే జనవరి 26 గణతంత్ర దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని రైల్వే సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించ తలపెట్టిన రైల్వే ఉద్యోగుల క్రీడా పోటీలు ఆదివారం వలిగొండలో ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ క్రీడా పోటీల ప్రారంభోత్సవ కార్యక్రమానికి దక్షిణ మధ్య రైల్వే పిడబ్ల్యుఎవై / సిటీ వై.ఎల్. రామ్ భద్ర రావు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వలిగొండలో నిర్వహిస్తున్న క్రికెట్ పోటీలకు ఆయన టాస్ వేసి అధికారికంగా ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విధి నిర్వహణలో నిత్యం ఒత్తిడితో గడిపే రైల్వే ఉద్యోగులకు ఇలాంటి క్రీడా పోటీలు మానసిక ఉల్లాసాన్ని కలిగించడంతో పాటు శారీరక ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తాయని పేర్కొన్నారు. ఉద్యోగుల మధ్య ఐక్యత, స్నేహభావం పెంపొందించడంలో క్రీడలు కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు. ఈ క్రీడా పోటీల్లో చిట్యాల నుండి బొమ్మాయిపల్లి వరకు విధులు నిర్వహిస్తున్న రైల్వే ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ముఖ్యంగా క్రికెట్ పోటీల్లో క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను కనబరిచారు. ఈ కార్యక్రమంలో రైల్వే ఇన్స్టిట్యూట్ సెక్రటరీ కాసాని ప్రసాద్, ట్రెజరర్ మామిడి కృష్ణ, రైల్వే ఇంజనీరింగ్ విభాగానికి చెందిన కర్రె బిక్షపతి తదితరులు పాల్గొన్నారు. అలాగే పెద్ద సంఖ్యలో రైల్వే ఉద్యోగులు క్రీడా పోటీలను తిలకించి క్రీడాకారులను ఉత్సాహపరిచారు.

# మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు

**- ట్రాఫిక్ నిబంధనలపై ఆటో కార్మికులకు ఏఎస్ఐ అవగాహన**




ఆలేరు, జనవరి 18 (తొలివెలుగు) : మద్యం సేవించి వాహనాలు నడిపితే చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని ఆలేరు ఏఎస్ఐ ఆంజనేయులు అన్నారు. ఆదివారం ఆలేరు పట్టణ కేంద్రంలోని బస్టాండ్ ఆవరణలో ఆటో కార్మికులు, వాహనదారులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రహదారి నిబంధనలు ప్రతి ఒక్కరూ విధిగా పాటించాలన్నారు. ముఖ్యంగా ఆటో కార్మికులు మద్యం సేవించి వాహనాలు నడపరాదని, నిబంధనలు అతిక్రమిస్తే డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేస్తామని స్పష్టం చేశారు. నంబర్ ప్లేట్లు స్పష్టంగా ఉండాలని, లైసెన్స్ తదితర పత్రాలను అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. బస్టాండ్ సమీపంలో రోడ్లపై విచ్చలవిడిగా ఆటోలు నిలిపి ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించవద్దన్నారు. అలాగే, పట్టణంలో కొత్త వ్యక్తులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని, సైబర్ నేరగాళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో కానిస్టేబుళ్లు చంద్రశేఖర్, నవీన్, పెట్రోలింగ్ సిబ్బంది, ఆటో కార్మికులు, వ్యాపారస్తులు పాల్గొన్నారు.

# ఘనంగా ఎన్టీఆర్ 30వ వర్ధంతి వేడుకలు

**- పటేల్, పట్వారీ వ్యవస్థ రద్దు చేసిన మహనీయుడు**

**: సుంకరి జంగయ్య గౌడ్**



చౌటుప్పల్, జనవరి 18 (తొలివెలుగు) : తెలుగు ప్రజల ఆరాధ్య దైవం, స్వర్గీయ నందమూరి తారక రామారావు 30వ వర్ధంతిని చౌటుప్పల్ మండల కేంద్రంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. మున్సిపాలిటీ అధ్యక్షుడు సుంకరి జంగయ్య గౌడ్ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జంగయ్య గౌడ్ మాట్లాడుతూ.. 1983లో పార్టీ స్థాపించిన అనతి కాలంలోనే అధికారంలోకి వచ్చి, సామాన్యుడికి ఇబ్బందిగా ఉన్న పటేల్, పట్వారీ వ్యవస్థను రద్దు చేసిన ఘనత ఎన్టీఆర్ దేనన్నారు. పాలనను ప్రజలకు చేరువ చేసేందుకు మండల వ్యవస్థను తీసుకువచ్చిన సంస్కర్త ఆయనేనని కొనియాడారు. సినిమా, రాజకీయ రంగాల్లో ఎన్టీఆర్ సృష్టించిన చరిత్ర అజరామరమని పేర్కొన్నారు. రాబోయే మున్సిపాలిటీ, జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ జెండా ఎగరవేస్తామని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నల్ల పర్వతాలు ఉపాధ్యక్షుడు మారగోని అశోక్ గౌడ్, ఉపాధ్యక్షుడు వర్కాల వెంకటేష్ గౌడ్, ప్రధాన కార్యదర్శి గుమ్మడి అంజిరెడ్డి, తడక కోటేశ్వర్, బొంగు బాదుషా గౌడ్, పోలోజు గోవిందా చారి, గోసుకొండ వెంకటేష్, యు. శ్రీను గౌడ్, చిట్కా అశోక్ గౌడ్, బోదుల గణేష్, ఉపేందర్ చారి, అంతటి కృష్ణయ్య, సిగ్గిరెడ్డి సురేందర్ రెడ్డి, బిగ్గి మహేష్, శివగోని రమేష్ గౌడ్, చిన్నం కృష్ణ, గుర్రం నరసింహ, గుర్రం కృష్ణ, ముమ్మడి లింగాచారి, బొడ్డు రాందాసు, ప్రచార కార్యదర్శి కృష్ణ తేజ, యాట వెంకటేష్, కొండూరు నరసింహ, ముత్యాల పాపిరెడ్డి, కందకట్ల రామకృష్ణ, తీగుల ఐలయ్య తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఎస్.లింగోటంలో రైతు ఆకస్మిక మృతి

**- మేడారం వెళ్లిన కుటుంబ సభ్యులు..**

**- ఇంట్లోనే విగతజీవిగా భర్త**

చౌటుప్పల్, జనవరి 18 (తొలివెలుగు) : చౌటుప్పల్ మండలం, ఎస్.లింగోటం గ్రామంలో చింతపల్లి అంజిరెడ్డి (57), అనే రైతు అనారోగ్యంతో మృతి చెందారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అంజిరెడ్డి భార్య స్వర్ణలత, కుటుంబ సభ్యులు ఈనెల 16న మేడారం జాతరకు వెళ్లారు. అంజిరెడ్డి గత కొంతకాలంగా బిపి, షుగర్ వ్యాధులతో బాధపడుతుండటంతో ఆయన ఇంట్లోనే ఉన్నారు. ఆదివారం తెల్లవారుజామున పాలు పోయడం కోసం వచ్చిన బంధువు భూపాల్ రెడ్డి.. ఇంట్లో లైట్లు వేసి ఉండటం గమనించి లోపలికి వెళ్లి చూడగా, అంజిరెడ్డి బెడ్రూంలో అపస్మారక స్థితిలో పడి ఉన్నారు. అప్పటికే ఆయన మృతి చెందినట్లు గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతురాలి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ బి. అజయ్ భార్గవ్ తెలిపారు.

# అట్టహాసంగా రాజు గౌడ్ జన్మదిన వేడుకలు

## చౌటుప్పల్‌లో కాంగ్రెస్ శ్రేణుల సంబరాలు







చౌటుప్పల్, జనవరి 18 (తొలివెలుగు) : మునుగోడు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త పబ్బు రాజు గౌడ్ జన్మదిన వేడుకలు ఆదివారం చౌటుప్పల్‌లో ఘనంగా జరిగాయి. 'టీమ్ పీఆర్‌జీ' ఆధ్వర్యంలో మున్సిపాలిటీ పరిధిలోని అమ్మానాన్న అనాథాశ్రమంలో అనాథలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ.. రాజు గౌడ్ నిరంతరం ప్రజాసేవలో ఉండాలని ఆకాంక్షించారు. అనంతరం ఆయనకు కార్యకర్తలు ఘనస్వాగతం పలికి, క్యాంప్ కార్యాలయంలో కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ ఉబ్బు వెంకటయ్య, మాజీ జెడ్పీటీసీ చిలుకూరి ప్రభాకర్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఆకుల ఇంద్రసేనారెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ వెన్‌రెడ్డి రాజు, మండల అధ్యక్షుడు బోయ దేవేందర్, మున్సిపల్ అధ్యక్షుడు సుర్వి నరసింహ గౌడ్, మున్సిపాలిటీ నాయకులు మోగుదాల రమేష్ గౌడ్, బత్తుల విప్లవ్ కుమార్ గౌడ్, చెరుకు లింగస్వామి గౌడ్, రావుల స్వామి, కంచరకుంట్ల రాంరెడ్డి, చెవగోని వెంకటేష్ గౌడ్, సందగళ్ళ సతీష్ గౌడ్, దుబ్బాక ఆకాష్ రెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

# మల్కాపురం వద్ద ఘోర రోడ్డు ప్రమాదం

- గుర్తుతెలియని లారీ ఢీకొని మహిళ దుర్మరణం
- దర్శనం చేసుకుని వస్తుండగా విషాదం.. భర్త, కుమార్తెకు గాయాలు

చౌటుప్పల్, జనవరి 18 (తొలివెలుగు) : జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ మహిళా కూలి అక్కడికక్కడే దుర్మరణం పాలయ్యారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రంగారెడ్డి జిల్లా బాలాపూర్ మండలం గుర్రంగూడకు చెందిన పుట్టగళ్ల విక్రం తన భార్య దుర్గ (28), కుమార్తె జాన్‌శ్రీతో కలిసి శనివారం చెరువుగట్టు దర్శనానికి వెళ్లారు. ఆదివారం ఉదయం 8:30 గంటల సమయంలో తమ యాక్టివాపై తిరిగి వస్తుండగా, చౌటుప్పల్ మండలం మల్కాపురం ఆందోళ్ మైసమ్మ గుడి సమీపంలో విజయవాడ నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న ఒక గుర్తుతెలియని లారీ వెనుక నుండి అతివేగంగా వచ్చి వారి వాహనాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కిందపడిన దుర్గ తలపై నుండి లారీ చక్రాలు వెళ్లడంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందారు. విక్రంతో పాటు నాలుగేళ్ల కుమార్తెకు తీవ్ర గాయాలయ్యాయి. ఏ దుర్ఘటనపై ఎస్ఐ ఉపేందర్ రెడ్డి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

# పబ్బు రాజుకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన సర్పంచ్ జువ్వి నర్సింహ్మా



చౌటుప్పల్, జనవరి 18 (తొలివెలుగు) : కాంగ్రెస్ పార్టీ మునుగోడు నియోజకవర్గ సమన్వయకర్త పబ్బు రాజు గౌడ్ జన్మదిన వేడుకలు చౌటుప్పల్ లో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా లక్కారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ధర్మోజిగూడెం గ్రామ సర్పంచ్ జువ్వి నర్సింహ్మా పబ్బు రాజు గౌడ్ ను మర్యాదపూర్వకంగా కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయనను శాలువాతో సత్కరించి, పండ్ల బొకేను అందజేశారు. రాబోయే రోజుల్లో మరింత ఉన్నత శిఖరాలను అధిరోహించాలని, ప్రజాసేవలో మరింత ముందుకు సాగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు ఊదరి శ్రీనివాస్, ఐతరాజు శారద లింగస్వామి, రాచకొండ భార్గవ్, బ్లాక్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి బత్తుల శ్రీహరి, మాజీ సర్పంచ్ బద్రి లింగయ్య, మాజీ ఉపసర్పంచ్ కొంత బుచ్చిరెడ్డి తదితర కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# వేగం ప్రాణాంతకం.. నిబంధనలే రక్షా కవచం!

- తంగడపల్లి రోడ్డులో 'అరైవ్ అలైవ్' అవగాహన సదస్సు
- నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు
- ట్రాఫిక్ సీఐ విజయ్ మోహన్




చౌటుప్పల్, జనవరి 18 (తొలివెలుగు) : వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలను తూచా తప్పకుండా పాటించినప్పుడే సురక్షిత ప్రయాణం సాధ్యమని చౌటుప్పల్ ట్రాఫిక్ సీఐ విజయ్ మోహన్ పేర్కొన్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా ఎస్పీ అక్షాంశ్ యాదవ్ ఆదేశాల మేరకు ఆదివారం చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రంలోని తంగడపల్లి రోడ్డులో 'అరైవ్ అలైవ్' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విజయ్ మోహన్ మాట్లాడుతూ.. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్, కారు ప్రయాణికులు సీట్ బెల్ట్ ధరించడం తప్పనిసరి అని గుర్తు చేశారు. ఆటోలలో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించవద్దని, వాహనాలకు సంబంధించిన పత్రాలు సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్ఐ ఆంజనేయులు, ఏఎస్ఐ శ్రీనివాస్, కానిస్టేబుళ్లు పరశురాములు, శంకర్ తదితర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# సురక్షిత ప్రయాణం.. అందరికీ క్షేమం

- వలిగొండ ఎక్స్ రోడ్డులో 'అరైవ్ అలైవ్' అవగాహన సదస్సు
- ఇన్స్‌పెక్టర్ జి. మన్మథ కుమార్





చౌటుప్పల్, జనవరి 18 (తొలివెలుగు): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'అరైవ్ అలైవ్ క్యాంపెయిన్-2026' కార్యక్రమంలో భాగంగా ఆదివారం వలిగొండ ఎక్స్ రోడ్డులో రహదారి భద్రతపై అవగాహన సదస్సు నిర్వహించారు. చౌటుప్పల్ ఇన్స్‌పెక్టర్ జి. మన్మథ కుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో వాహనదారులకు రోడ్డు నిబంధనలపై దిశానిర్దేశం చేశారు. టూ వీలర్ వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, కార్లలో ప్రయాణించే వారు సీట్ బెల్ట్ ధరించాలని ఆయన సూచించారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే ప్రమాదాల బారిన పడటమే కాకుండా కఠిన చర్యలు ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, వాహనదారులు పాల్గొన్నారు.